క్లుప్తంగా

మాదక ద్రవ్యాల రహిత దేశంగా భారత్

వైవీయూ: మాదక ద్రవ్యాల రహిత దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దడంలో తమవంతు పాత్ర పోషిస్తామని మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. బుధవారం కళాశాలలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కృష్ణకిశోర్ విచ్చేసి మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలను వివరించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మిర్జా విలాయత్ అలీబేగ్ , జిల్లా డీ అడిక్షన్ సెంటర్ సూపరింటెండెంట్ అనిల్ మాట్లాడారు.

క్రమశిక్షణతో లక్ష్యసాధన సాధ్యం



ఓరియంటేషన్ డేలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ: క్రమశిక్షణ, పట్టుదలతో మనం నిర్దేశించుకున్న ఉన్నత లక్ష్యాలను సాధించుకోవచ్చని వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం కడప నగరం పక్కీరుపల్లెరోడ్డులోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డే, సిలబస్, అకడమిక్ క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ మధుసూధన్‌రెడ్డిలు కళాశాల ప్రగతిని గురించి వివరించారు. అనంతరం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం నిర్వహించడంతో పాటు కోర్సుకు సంబంధించిన విధి విధానాలు, సిలబస్ రూపకల్పన, అకడమిక్ క్యాలండర్‌ను వీసీ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

మెగా వైద్య శిబిరం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప రోటరీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వైవీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ఆవరణంలో బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రోటరీ క్లబ్ చైర్మన్ సాధు గోపాలకృష్ణ ప్రారంభించారు. క్లబ్ చైర్మన్ సాధు గోపాలకృష్ణ మాట్లాడుతూ రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలను వివరించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వారణాసి ప్రతాప్ రెడ్డి, (డయాబెటిస్), డా.ఎ. వంశీధర్ (కార్డియాలజిస్ట్), డా. ఎ.విద్యాధర్, (నేత్ర వైద్యుడు), డా. ఎం.డి.ఫర్హానుద్దీన్ (డెంటిస్ట్), వైవీయూ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ నరేష్ కుమార్ రెడ్డిలు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఉప ప్రధానాచార్యులు పుత్తా పద్మ, ప్రజాసంబంధాల విభాగం సంచాలకులు ఎస్.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న పుస్తకాల ఆవిష్కరణ

కడప కల్చరల్ : స్థానిక ప్రముఖులు ఎంసీ నాగిరెడ్డి రచించిన శతక మధురిమలు, బంధాలు, బాధ్యతలు పుస్తకాలను ఈనెల 18వ తేదీ నగర శివార్లలోని శ్రీరామకృష్ణ వానప్రస్థాశ్రమంలో ఆవిష్కరించనున్నారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమానికి కె.బాబురెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

జేసీని కలిసిన డీజీఎం



జేసీకి పూలమొక్క అందజేస్తున్న నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామమోహన్‌రెడ్డి

వైవీయూ: కడప నగరంలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామమోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం ఆయన జేసీని కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జర్నలిస్టులను ఆదుకోవాలి



జర్నలిస్టుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్: నిరంతరం ఒత్తిడితో జీవితం సాగిస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు కోరారు. పని ఒత్తిడికి తట్టుకోలేక గుండెపోటుతో మృతిచెందిన అనంతపురం కెమెరామెన్ శేఖర్, ఆర్థిక సమస్యలతో తన కుమార్తెకు ఉరివేసి తాను కూడా ఉరివేసుకున్న తెలంగాణ జర్నలిస్టు యోగి రెడ్డి మృతికి సంతాపం తెలియజేస్తూ కడప ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నివాళులర్పించారు. కడప జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బెల్లం రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్లు కృషి చేస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కడప జిల్లా ప్రతినిధి చంద్రమోహన్ రాజు, రిపోర్టర్లు, కెమెరా మెన్లు పాల్గొన్నారు.

మార్కెట్‌కు మువ్వన్నెల కళ



కడప నగర మార్కెట్‌లో జాతీయ జెండాలు



ప్రత్యేక ఆకర్షణగా జెండాలు

కడప కల్చరల్ : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని ప్రధాన మార్కెట్లు మువ్వన్నెల జెండాలు, ఇతర సామాగ్రితో కళకళలాడుతున్నాయి. కొన్ని దుకాణాలను పూర్తిగా జాతీయ జెండాలు, ఇతర అలంకార సామాగ్రితో నింపేశారు. పాఠశాలలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలలో ఎగుర వేసేందుకు ఆ సంస్థల ప్రతినిధులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద జెండాలు, ఇతర మువ్వన్నెల అలంకార సామాగ్రి కొనేందుకు రావడంతో దుకాణాలు సందడిగా మారుతున్నాయి. దాదాపు 25 నుంచి 30 రకాల సామాగ్రి అందుబాటులో ఉంచారు. కాటన్ (ఖాదీ) జెండాలు రూ. 80 నుంచి రూ. 400 ధరకు లభిస్తున్నాయి. సిల్క్ జెండా రూ. 75 నుంచి రూ. 200లోపు లభిస్తున్నాయి. పలు సైజుల్లో (పిల్లలు ఆడుకునే) చిన్న జెండాలు దాదాపు పది రకాల డిజైన్లలో ఉన్నాయి. 12 జెండాల సెట్ రూ. 25 నుంచి రూ. 35 వరకు లభిస్తున్నాయి. టోపీలు రూ. 20 నుంచి రూ.650, టీ షర్టులు రూ. 175 నుంచి రూ.400, రిస్ట్, హెడ్ బ్యాండ్లు రూ. 15 నుంచి రూ.40, రంగుల పేస్ట్ సెట్ రూ. 35 నుంచి రూ.60లకు విక్రయిస్తున్నారు. జెండాల వ్యాపారం జోరుగా సాగుతుండడంతో వ్యాపారులు సైతం సంతోషంగా ఉన్నారు.

ప్లాస్టిక్ తగ్గింది..

మార్కెట్‌లో ప్లాస్టిక్ జెండాలు తగ్గాయి. ప్లాస్టిక్ జెండాలను వాడకూడదని ప్రభుత్వం సూచించడం, స్థానిక అధికారుల పర్యవేక్షణ పెరగడంతో దుకాణదారులు ఈ విషయంలో సంయమనం పాటిస్తూ ప్లాస్టిక్ జెండాలు, స్టిక్కర్లు తదితరాలను చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే విక్రయిస్తున్నారు. వీటి స్థానంలో ఫైబర్ కోటెడ్ పేపర్ మెటీరియల్ ఎక్కువగా దుకాణాల్లో కనిపిస్తోంది.

వైద్యుల కోసం ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి

కడప అర్బన్: వైద్యుల కోసం ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన, ఆందోళన చేపట్టారు. కోల్‌కత్తాలో ఓ వైద్యురాలిపై అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కడప సంధ్యా సర్కిల్ నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు ర్యాలీ, నిరసన చేశారు. కోటిరెడ్డి సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. వైద్యులపై దాడులను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ కడప రిమ్స్ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. ఖదీర్ హుసేన్, ఉపాధ్యక్షులు డాక్టర్ అశ్విని, డాక్టర్ అల్లూరి నిఖిల్ సింగ్, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ విష్ణుప్రసాద్, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డితో పాటు జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



కడప కోటిరెడ్డి సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు

పెద్దదర్గాలో సినీ నటి నిహారిక



పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న నిహారిక

కడప కల్చరల్ : కడప అమీన్‌పీర్ దర్గా (పెద్దదర్గా)ను సినీ నటి కొణిదెల నిహారిక బుధవారం రాత్రి దర్శించుకున్నారు. కమిటీ కుర్రోళ్లు సినిమా సక్సెస్ మీట్‌లో భాగంగా ఆ సినీ యూనిట్‌తో కలిసి కడప పెద్దదర్గాకు చేరుకున్న నిహారిక బృందానికి దర్గా ముజావర్, ఇతర ప్రతినిధులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. తలపై చాదర్ పెట్టుకుని దర్గాకు చేరుకున్న నిహారిక దర్గా గురువులకు చాదర్‌ను సమర్పించారు. అనంతరం దర్గాలోని హజరత్ పీరుల్లా మాలిక్ మజార్‌ను, ఆ తర్వాత దర్గా ఆవరణలోని ఇతర గురువుల మజార్‌లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆమెకు దర్గా ప్రతినిధులు గురువుల చరిత్ర, విశిష్టతను తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కమిటీ కుర్రోళ్లు సినిమాను ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అక్కడి నుంచి ఆ బృందం నగరంలోని అప్సర థియేటర్‌కు చేరుకుని ప్రేక్షకులతో మాట్లాడారు. సినిమాకు విజయం చేకూర్చడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు.

'బ్రౌన్' పేరిట బోర్డు కోసం వినతి

కడప కల్చరల్ : కడప నగరం ఎర్రముక్కపల్లె నుంచి బ్రౌన్ గ్రంథాలయం వరకు సీపీ బ్రౌన్ రోడ్డు అనే బోర్డును ఏర్పాటు చేయాలని బ్రౌన్ గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి కుమారుడు జానమద్ది విజయభాస్కర్ కోరారు. బుధవారం ఆయన నగర మేయర్ కొత్తమద్ది సురేష్‌బాబుకు ఈ మేరకు లేఖ రాశారు. కడప నగరం సుందరీకరణలో భాగంగా చాలా వీధులకు పేర్లతో బోర్డులను ఏర్పాటు చేశారని, ఆ వరుసలో ఎర్రముక్కపల్లె సెంటర్ నుంచి బ్రౌన్ గ్రంథాలయానికి వెళ్లే రోడ్డుకు సీపీ బ్రౌన్ రోడ్డు అని బోర్డు ఏర్పాటు చేశారన్నారు. కానీ రోడ్డు విస్తరణలో భాగంగా బోర్డును తొలగించారన్నారు. త్వరలో జరిగే జనరల్ బాడీ సమావేశంలో దీనికి అనుకూలంగా తీర్మానం ప్రవేశపెట్టి ఆ రోడ్డుకు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ రోడ్డుగా బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

కలెక్టర్‌కు చెక్కు అందజేత



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ ప్రదానోత్సవం పథకం ద్వారా 5, 6, 7, 8, 9, 10వ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన ఎస్సీ ఎస్టీ విద్యార్థినిలకు స్కాలర్‌షిప్ అందజేయనుంది. బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కెనరా బ్యాంక్ కడప ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని శాఖల ద్వారా 294 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు రూ.11,76,000 పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన చెక్కును కెనరా బ్యాంకు కడప ప్రాంతీయ కార్యాలయ అధికారి మురళీ మోహన్ బుధవారం జిల్లా కలెక్టర్ శివశంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ రమేష్, ఎల్‌డీఎం జి.జనార్దనం పాల్గొన్నారు.

ఛాయా చిత్ర ప్రదర్శన



యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ఆధ్వర్యంలో బుధవారం 'జిల్లాలో స్వాతంత్ర్య సమరయోధుల ఛాయాచిత్ర ప్రదర్శన' నిర్వహించారు. ఈ ప్రదర్శనను వైస్ చాన్సలర్ ఆచార్య కృష్ణారెడ్డి ప్రారంభించారు. సివి రామన్ సైన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యుడు, టీచర్ శ్రీనివాస్ రెడ్డి జిల్లా స్వాతంత్ర సమరయోధులకు సంబంధించిన చిత్రాలను సేకరించి ప్రదర్శించారు. – వైవీయూ

ఘనంగా హర్ ఘర్ తిరంగా



నారాయణ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం కడప నగరంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంను నిర్వహించారు. 1000 మంది విద్యార్థులు మువ్వన్నెల జెండాతో జిల్లా పరిషత్, కోటిరెడ్డి కూడలి నుంచి ఏడు రోడ్ల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యా సంస్థల ఏజీఎం శ్రీనివాసులు, డీజీఎం రామ్మోహన్‌రెడ్డి, ఏజీఎం రాజు, కిరణ్, రామక్రిష్ణ పాల్గొన్నారు. – కడప రూరల్

ఆర్టీసీ బస్టాండ్ కిటకిట..



వరుస సెలవుల నేపథ్యంలో ప్రజలు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించడంతో బుధవారం కడప ఆర్టీసీ బస్టాండు ప్రయాణీకులతో కిటకిటలాడింది. స్వాతంత్ర్య దినోత్సవం, వరలక్ష్మీవ్రతం, రాఖీ పండుగ నేపథ్యంలో సెలవులు ఉన్నాయి. ఈ క్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర వర్గాలు తమతమ స్వస్థలాలకు వెళ్లేందుకు, వచ్చేవారితో బస్టాండు కిక్కిరిసింది. – కడప కోటిరెడ్డిసర్కిల్

ఎనిమిది అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామ పంచాయతీ పరిధిలోని జంగంపల్లె సమీపంలో బుధవారం రాత్రి యర్రగుంట్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు 8 అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. సెబ్ సీఐ లీలారాణి ఆధ్వర్యంలో ఎస్ఐ సుబ్రమణ్యం, వారి సిబ్బంది జంగంపల్లె సమీపంలో దాడులు నిర్వహించి పాపాఘ్ని నదిలో ఇసుకను లోడు చేసుకుని తరలిస్తున్న 8 ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ మేరకు పట్టుబడ్డ ట్రాక్టర్లకు ఒక్కో దానికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. దాడులు నిర్వహించే సమయంలో నదిలో సుమారు 20కి పైగా ట్రాక్టర్లు వున్నట్లు సమాచారం. నది నుండి రోడ్డుపైకి చేరే ప్రాంతంలో నిఘా వుంచి ట్రాక్టర్లను పట్టుకుంటున్నారనే సమాచారంతో భారీగా ట్రాక్టర్లు నదిలో నుంచి తప్పించుకున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో ఐదుగురు సీఐల బదిలీ

కడప అర్బన్: కర్నూల్ రేంజ్ పరిధిలో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. సి. శంకర్ రెడ్డిని వీఆర్ కడపకు, జి. జీవన్ గంగానాథ్ బాబు– పులివెందుల యుపిఎస్, ఎన్.వెంకటరమణ– పులివెందుల రూరల్, జి వెంకటేశ్వర్లు–కడప తాలూకా, ఎస్ వి నాగరాజు– రాజంపేట కు బదిలీ చేశారు.

వరదనీటి కాలువ పనులు సత్వరమే పూర్తి చేయాలి

– నగరపాలక కమిషనర్ వైఓ నందన్

కడప కార్పొరేషన్: కడప నగరంలో వరదనీటి కాలువ పనులను సత్వరమే పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన అక్కాయపల్లె పార్కు, గాంధీపార్కు, ఎర్రముక్కపల్లె జంక్షన్, గాంధీప్లాజా, భగత్ సింగ్ పార్కు, ఈట్ స్ట్రీట్ ప్రాంతాలను పరిశీలించారు. కోటిరెడ్డి సర్కిల్ నుండి బుగ్గవంక వరకు ఏర్పాటు చేసిన వరదనీటి కాలువకు ఇరువైపులా మట్టిని నింపాలని సూచించారు. అక్కాయ పల్లె పార్క్ వద్ద ఉన్న టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ వైఓ నందన్

19న ఫొటో ఎగ్జిబిషన్

కడప కల్చరల్ : అంతర్జాతీయ 185వ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 19వ తేదీన హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయంలో ఫొటోల ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు ఎ.వెంకట సుబ్బయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు, ఏపీ ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. సంస్థ కార్యాలయంలో బుధవారం ప్రదర్శనకు సంబంధించిన ప్రచార పోస్టర్లను వారు విడుదల చేశారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి ఈ ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు.

మానవ హక్కులపై ప్రచారం

కడప కార్పొరేషన్: మానవ హక్కులపై విస్తృత ప్రచారం చేసేందుకు ప్రపంచమానవ హక్కుల అవగాహనా సంఘం ఖచ్చితత్వంతో ముందుకెళ్తుందని ఆ సంఘం జాతీయ చైర్మన్ కాసాల కోనయ్య పేర్కొన్నారు. బుధవారం కడప ఎస్పీ బంగాళా లో ఎస్పీ హర్ష వర్ధన్ రాజును గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పుష్ప గుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం వివరాలు, చేస్తున్న సేవలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ కోనయ్య మాట్లాడుతూ మానవ హక్కులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ స్పందించి మానవ హక్కుల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక విభాగ చైర్మన్ టి. ఓబులేసు , రాయలసీమ రీజినల్ చైర్మన్ ఎన్.సురేష్ బాబు , మీడియా విభాగ చైర్మన్ జి.రాఘవ ,కడప జిల్లా చైర్మన్ లోకేష్ పలు విభాగాల చైర్మెన్లు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతి ఉపయుక్తం

వైవీయూ: డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తనాలను విత్తడం రైతులకు ఎంతో ఉపయోగకరమని కడప మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఎస్.వి. సురేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప మండల పరిధిలోని పాలంపల్లె గ్రామ పొలాల్లో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరినాటే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్‌సీడర్ పద్ధతిలో కూలీల అవసరం లేకుండా ఒక మనిషికి రోజుకు 2–3 ఎకరాలు విత్తుకోవచ్చన్నారు. ఒక ఎకరాకు 8–10 కేజీల విత్తనం సరిపోతుందన్నారు.

కమిషనర్‌కు అభినందన

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వైఓ నందన్‌కు జిల్లాలోని గ్రూప్–1 అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం వారు కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా ఉపాధి అధికారి ఏ. సురేష్ కుమార్, జిల్లా సహాయ ఆడిట్ అధికారి శ్యామ్యూల్ డెన్నీ, నగరపాలక అదనపు కమిషనర్ రాకేష్ చంద్రన్ ఉన్నారు.

వైవీయూ వీసీని తొలగించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వైవీయూ వీసీ కృష్ణారెడ్డిని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైవీయూ ఇంచార్జ్ వీసీగా లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణారెడ్డిని నియమించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. వెంటనే ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడుశివశంకర్, ఎస్ఎస్‌యూ జిల్లా కార్యదర్శి మామిళ్ళ బాబు, ,ఏఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షులు చంద్ర పాల్గొన్నారు.